


"ఏవండీ! కొంచెం సౌండ్ పెంచండి టీ.వీది."

"సౌండ్ ఎక్కువైంది. చెవులో దూది పెట్టుకుని చూస్తున్నా. అయినా టీవీ వంటింట్లోకి వినిపించేలా పెట్టుకోవాలా? అంత కొంప మునిగిపోయేది ఏముంది?"

"నాన్నా! కొంచెం టీవీ సౌండ్ తగ్గించు నాన్నా! చదువుకోవాలి."

"ఛ! నా పరిస్థితేంటి ఇలా అయిపోయింది. నాకంటూ స్వాతంత్ర్యం లేదా కొంపలో!" అనుకున్నాడు కుటుంబరావు.

"వినపడలేదా! అబ్బాయి సౌండ్ తగ్గించమంటుంటే వాడు చదువుకోవాలేమో సౌండ్ తగ్గించండి."

"వాడి మొహం వాడికి నిద్ర పట్టటం లేదుట. అదీ వాడి ఏడుపు" అంటూ టీవీ కట్టేసి 'ఉస్' అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

"ఏంటి అలా కూర్చున్నారు? ఆఫీసులో పెద్దేదో కష్టపడిపోయినట్టు!"

"అంటే నీ ఉద్దేశ్యం ఏంటే?" అందామనిపించింది. ఆవిడ చేతులో టమోటా తరుగుతున్న చాకు చూసి ఆపేశాడు కుటుంబరావు.

"త్వరగా తయారవ్వు. సినిమాకెళ్దాం."

"నేనూ వస్తాను డాడీ!"

"చదువుకోమంటే పడుకుంటానంటావు. ఇప్పుడు ఎలా వచ్చిందిరా మెలకువ! చదువు చూస్తే 32వ ర్యాంక్. చదువుకో. చీరేస్తా!"

"అదేంటి నాన్నా! నా తరువాత ర్యాంకర్స్ 33,34,35 అందరూ అన్ని సినిమాలు చూశారట. నాకు చాలా చిన్నతనంగా వుంది తెలుసా?"

"స్కూలుకు వెళ్ళినవాడు చదవకపోతే చిన్నతనం. సినిమా చూడకపోతే చిన్నతనం కాదు."

"చూడు మమ్మీ, డాడీని!"

"ఒరే! పెళ్ళయినప్పటి నుంచీ చూస్తున్నా ఆయన వాలకం. విభజించి పాలించే టైపు."

"ఇంక చాల్లే! నోర్మూయ్యండి. వెధవ సినిమా కోసం 60 సంవత్సరాల క్రితం తెల్లవాళ్ళ పాలనని వాడేశావు. నువ్వు బి.ఎ కాస్త పాసయివుంటే నన్ను చంపేద్దువు."

"ఇంక బి.ఎ ఏంటి? పెళ్ళయ్యాక ఆడది

వంటింటి కుందేలేగా? కామి అన్నం పెట్టు, కామీ బట్టలు ఉతుకు, కామీ...అంటూ నా యవ్వనాన్నంతా చదువుకోనివ్వకుండా వృధా చేశారు" అంది భార్య కామేశ్వరి.

"ఇంక నోర్ముయ్. నీ యవ్వనం వృధా అయితే మనకి తేజా ఎలా పుడతాడు?" కొంటెగా అన్నాడు.

"అబ్బా! అప్పుడే సరసం!"

ఈ నవరసాలు చూడలేక తేజాగాడు "సినిమాకి తీసుకెళతారా? పక్కింటి అంకుల్ వాళ్ళు వెళతానన్నారు, వాళ్ళతో పోనా?"

అంత ఖచ్చితంగా అడిగితే జవాబు ఏం చెప్పాలో తెలియని కుటుంబరావు "అందరూ తయారవ్వండి" అన్నాడు.

"ఇదిగోండి కాఫీ" కాస్త మెలికలు తిరుగుతూ.

"సగటు మగవాడికి ఒకటో తారీఖున, ఇలా సినిమాకి తీసుకెళ్తానన్న రోజున అన్ని మర్యాదలు జరుగుతాయి" అనుకుంటూ కాఫీ తాగుతున్నాడు కుటుంబరావు.

"నాన్నా! చిచ్చర పిడుగు సినిమాకెళ్దాం!"

"నువ్వాగరా! 'మహిళాలోకం'కు వెళ్దామండి!"

"అలా కుదరదు. 'ముందు నుయ్యి-వెనుక గొయ్యి' సినిమాకెళ్దాం." అని కాసేపు వాదించుకున్నాక, ఓ నిర్ణయానికి వచ్చారు. ఆ మూడు హాల్స్ ఒకే వీధిలో వున్నాయి కాబట్టి ముగ్గురం మూడు సినిమాలకి వెళ్దాం అని నిర్ణయానికొచ్చారు.

"రిక్షా, ఓ రిక్షా! ఇలా రా! సినీ స్ట్రీట్‌కి వెళ్ళటానికి ఎంత కావాలి?"

"అరగంట చాలు బాబయ్యా"

"టైం కాదయ్యా! కామెడీ ఆపు. డబ్బులు ఎంత తీసుకుంటావు? అని."

"ఎంతండి, ఓ ఇరవై ఇప్పించండి. తమ దొరల దయ."

"చాల్లే! నీ ఇరవై కోసం నన్ను దొరని చేశావంటే అది విని మా ఆవిడ పాతిక వేల పట్టుచీర కొనమంటుంది."

రిక్షాలో సినిమాకెళ్తూ...

"నా జీవితంలో మీలాంటి కుటుంబాన్ని చూడలేదండి బాబయ్యా! ఇంట్లో ముగ్గురుండి ఆ ముగ్గురూ మూడు వేరు వేరు సినిమాలకి వెళ్తున్నారంటే, నాకు చాలా ఆశ్చర్యంగా వుందండి."

"నీ జీవితం చాలదు కాని ఆపు. ఇదిగో ఇరవై రూపాయలు.'

"కొత్త కాఫీ నీళ్ళకి ఏమన్నా చిల్లర ఇప్పించండి బాబూ!"

## భవిష్యత్తు

తారకరత్న నటించిన 'ఒకటో నెంబర్ కుర్రాడు', 'యువరత్న' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఫట్‌మన్నాయి. దీనితో తారకరత్న సినిమా కెరీర్‌పై ఇండస్ట్రీలో నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రస్తుతం తారకరత్న 'తారక్' అనే చిత్రంలో నటిస్తున్నాడు. నందమూరి వంశం నుండి వచ్చిన వ్యక్తి కాబట్టి తారకరత్న కెరీర్ బాగుంటుందని భావించారు. కానీ అతని చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవడంతో ఇండస్ట్రీ తారకరత్న భవిష్యత్తుపై పెదవి విరుస్తోంది. 'తారక్' సినిమాతో తారకరత్న సినిమాల్లో ఇకముందు కొనసాగుతాడా లేదా అన్నది తేలిపోతుంది.

"అయితే ఆ ఇరవై ఇలాగియ్యి. ఇదిగో అయిదు రూపాయలు."

"కామెడాండి బాబూ! నవ్వొచ్చేత్తన్నాది హి...హి...హి. వంద రూపాయల టిక్కెట్టుకి ఖర్చు పెడతారు గాని కట్టబడ్డ పొట్టకి అయిదు రూకలు ఇవ్వలేరు" అనుకుంటూ రిక్షా తిప్పుకు పోయాడు.


ఇదేంటి కారణం లేని గోల అనుకుంటూ ఇద్దరికీ రెండు సార్లు లైన్లో నుంచొని టిక్కెట్స్ కొని ఇచ్చి వాళ్ళని లోపలకి పంపించి మూడో లైన్‌లో నిలబడ్డాడు. కుటుంబరావు సరిగ్గా బుకింగ్ దగ్గరకు వచ్చేసరికి కౌంటర్ క్లోజ్ చేసి హైస్ఫుల్ బోర్డు పెట్టాడు. పరిగెత్తుకుంటూ ఆ రెండు హాల్స్ దగ్గరకు వెళ్ళేసరికి ఆ హాల్స్‌కీ హౌస్‌ఫుల్ బోర్డ్స్ పెట్టి వున్నాయి. వెళ్ళిపోదామంటే మళ్ళీ వచ్చి వాళ్ళని తీసుకెళ్ళాలి. ఉందామంటే రెండున్నర గంటలు ఎక్కడ కూర్చోవడం? ముందు నుయ్యి-వెనుక గొయ్యి అంటే ఇదే. ఇంక వేరే సినిమా ఎందుకని గాల్లో తిరిగొచ్చి వాళ్ళని ఇంటికి తీసుకెళ్ళాడు. అందరూ భోజనం చేశారు.

"ఏంటి నాన్నా! సీరియస్‌గా వున్నాయి? సినిమా అంత సీరియస్సా?"

"ఏవండీ! అంత బాగో లేదా సినిమా? అందుకనే నేను మహిళా లోకం సినిమాకి రమ్మన్నాను. వినరుగా! పెళ్ళయినప్పటి నుంచి చూస్తున్నాను. ఏ మాట విన్నారు కనుక ఇది వినడానికి!"

"ఆపవే అమ్మా నీ గోల, నాన్నా! 'పురుషాధిక్య ప్రపంచం' పైన ఆఫీసులో నాలుగైదు పేజీల వ్యాసం రాసుకురా, రేపు స్కూల్లో వ్యాస రచన పోటీ. అది చూసి ఎక్కించేస్తాను."

కుటుంబ రావు పరిస్థితి ఆయనకే అర్థం కాలేదు. ఇది అసలు పురుషాధిక్య ప్రపంచమా?



అదీ నాలుగైదు పేజీల వ్యాసాన్ని ఆఫీసులో కూర్చొని రాయాలా? అది చూసి వీడు ఎక్కించేస్తాడా? ఛ! దబదబా తలకాయ గోడకి పునాదులు కదిలేలా కొట్టుకోవాలనిపించింది కుటుంబరావుకి. కాని ఆఫీసు బాసు సెలవలు ఇవ్వడని ఆ ఆలోచన విరమించుకున్నాడు.

"నాన్నా! బై గుడ్‌నైట్. తెల్లవారు జామున నాలుగు గంటలకు లేపు."

కుటుంబరావుకి చెప్పలేనంత ఆనందం కలిగింది అబ్బాయి నాలుగు గంటలకు లేచి చదువుకుంటాడని.

"మర్చిపోకు నాన్నా! నాలుగు గంటలకు లేపు. రేపు ఇండియా-ఆస్ట్రేలియా మ్యాచ్ నాలుగు గంటలకు స్టార్టవుతుంది. గుడ్‌నైట్!"

కుటుంబరావు గుండె పిండేసినంత పనయ్యింది. అయినా ఎక్కువ ఆనందాన్ని, విషాదాన్ని ఈ గుండె తట్టుకోలేదు. అందులోనూ అమోనియా తిళ్ళు అని సరిపెట్టుకుని బెడ్‌రూంలోకి పోయి నిద్రపోయాడు.

* * *

"ఏంరా! అంత తీరుబడిగా కూర్చున్నావు. స్కూల్‌కెళ్ళవా?"

"వెళ్ళను నాన్నా! ఈ రోజు ఇండియా-ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్. అందరూ కాన్వెంట్ మానేస్తారు. నేను స్కూల్‌కి వెళ్ళినా సరిగ్గా జరగదు."

"నీ తెలివితేటలు చదువులో పెడితే 12 సంవత్సరాల్లో ఎం.బి.బి.ఎస్.పూర్తి చెయ్యొచ్చు.

యూజ్ లెస్ ఫెలో" అని తిట్టుకుంటూ ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు కుటుంబరావు.

* * *

"సార్ కుటుంబరావుగారూ! మిమ్మల్ని మేనేజర్ గారు పిలుస్తున్నారు" పిలిచాడు ప్యూన్ మూర్తి.

"చచ్చాను. మూర్తీ! సార్ బి.పి. బిళ్ళ వేసుకున్నారా?"

"వేసుకున్నారు సార్ ఇంటి దగ్గర."

"హమ్మయ్య! ఫర్లేదు" అనుకుంటూ మేనేజర్ రూమ్‌కి వెళ్ళాడు.

ఆ మేనేజర్ కులకర్ణి అని కర్నాటక వాడు. నాలుగు రాష్ట్రాల్లో (ఆం.ప్ర, మ.ప్ర, ఉ.ప్ర, హి.ప్ర) చేసి చేసి బి.పి. పెరిగింది. దాంతో అందర్నీ అన్ని భాషల్లోనూ కలిపి తిట్టేస్తూ ఉంటాడు.

"మే ఐ కమిన్ సార్!"

"రమ్మనే పిలిచింది."

"ఎందుకు సార్?" వినయంగా. ఇంకొంచెం వంగితే ముఖం నేలకి తగిలేది.

"అంత వినయం వద్దు. అతి వినయం ధూర్త లక్షణం అనీ..."

"ఎందుకు సార్ అంత కోపంగా వున్నారు? నేనేం తప్పు చేశాను? ఇవాళ టైంకే కదా సార్ వచ్చాను ఆఫీసుకి."

"ఇవ్వాళే వచ్చావు నాయనా టైంకి. అయినా నిన్ను టైం గురించి ఎవరడిగారు? నీ ఇష్టం ఇచ్చినట్టు ఊహించుకోకు. నిన్న సినిమాకి వెళ్లాలండి అని పర్మిషన్ అడిగి అరగంట ముందు వెళ్ళిపోయావా నేనేదో పని అప్పచెపితే!"

"అవును సార్!"

"మరి నిన్న రాత్రి ఏడు గంటలకు రోడ్డు మీద ఖాళీగా పనీ గినీ లేకుండా తిరుగుతున్నావు? నిన్ను చూశానయ్యా, రోడ్డు మీదే కడిగేద్దామనుకున్నాను!"

కుటుంబరావు జరిగిందంతా చెప్పాడు.

"ఇంక చాల్లే ఈ కట్టు కథతో దసరా స్పెషల్‌కి నాటకం వెయ్యి. మంచి ప్రైజు వస్తుంది."

"అది కాదు సార్!"

"అదే అవును సార్! రేపు ఇంక్రిమెంట్లో నీ పని చెపుతాను."

బిక్క మొహంతో కుటుంబరావు బయటకు వచ్చి "ఏరా మూర్తీ! సార్ బి.పి బిళ్ళ వేసుకున్నాడన్నావు! వేసుకున్నాడా లేడా?"

"వేసుకున్నార్ సార్! మంచి నీళ్ళు త్రాగుతూ పులమారి కక్కుకున్నాడు సార్! అందులో పోయి వుంటుంది బిళ్ళ."

"ఆ మాట నేను రూములోకెళ్ళే ముందు చెప్పాలి."

"అయినా సినిమాకెళ్తానని, రోడ్డు మీద తిరిగితే ఎలా సార్?"

ఇంక కుటుంబరావుకి నోరు మెదల లేదు. ఆ రోజంతా ఆ పని ఈ పని మీద మేనేజర్ పిలిచి ఆఫ్రికన్ చింపాంజిలా ముఖం పెట్టి అంచలంచలుగా తిడుతూనే వున్నాడు.

ఆఫీసు నుంచి ఇంటికొచ్చి పేపర్ చదువుతున్నాడు కుటుంబరావు.

"డాడీ! నేనో ర్యాంక్ పైకి ఎక్కేశాను. ఇపుడు 33వ ర్యాంక్. ఇవ్వాళ ఏ సినిమాకి తీసుకెళతావు?"

"ఏడిశావు వెధవ! 32 నుంచి 33కు వెళ్ళటం అంటే ఒక ర్యాంక్ తగ్గటం అని అర్థం. తుక్కు వెధవా! ఏదో పెద్ద ఎవరెస్ట్ ఎక్కినట్టు ఈ సంచలనానికి మళ్ళీ సినిమా ఒకటి!"

"ఏమండీ! అబ్బాయికి కాన్వెంట్ ఫీజు కట్టాలి. ఒక షూ పడిపోయిందట. షూలు కొనాలి. అబ్బాయి డ్యాన్స్ స్కూలు ఫీజు కట్టాలి. నాకు ఒక చీర కొనాలి. మీరు ఒక.లుంగీ పంచె కొనుక్కోండి కావాలంటే. వీటన్నింటికీ డబ్బులు ఎలా వస్తాయండీ? ఏదైనా బ్యాంకులో లోన్ పెట్టుకోండి. అదే చేత్తో ఒక చంద్రహారం చేయిద్దురు!"

"ఏంటి నీకు పట్టు చీర ఆరువేలు, అబ్బాయి కాన్వెంట్ ఫీజు నాలుగు వేలు, షూస్ ఐదు వందలు, చంద్రహారం పదిహేను వేలు కొని పెట్టి నేను డెబ్బై రూపాయలు పెట్టి లుంగీ కొనుక్కోనా? ఈ రోజు నుంచి నేను లుంగీ కూడా కట్టుకోను. చారల లాగుతోనే ఉంటా ఇంటి దగ్గర" అంటూ లుంగీ విప్పి విసిరికొట్టాడు.

ఆ సీన్ చూసిన అపార్ట్‌మెంట్ అన్ని వాటాల తలుపులు, కిటికీ తలుపులు టపటపమని సీమ టపాకాయ సౌండ్ చేసుకుంటూ మూసుకున్నాయి.

ఆ రోజు నుంచే కుటుంబరావు చారల లాగుతోనే జాగింగ్, గార్డెన్‌కి వాటరింగ్ పైన చొక్కా తొడుక్కుని మార్కెటింగ్ అన్నీ వేస్తున్నాడు.

"అదేంటండీ! చారల లాగుతో తిరిగొస్తున్నారు. ఊరంతా అందరూ నవ్వడుగుతున్నారు."

"ఇంక నోర్మూయ్! నోరెత్తి ఎదురు చెబితే ఇది కూడా తీసేస్తాను, అబ్బాయిని ప్రక్క ఊళ్ళో హాస్టల్‌లో చేర్పిస్తాను."

"ఉన్న ఒక్క కొడుకుని దూరంగా హాస్టల్‌లో చేర్పిస్తానంటారేంటి?" అందామనుకుని ఈ మధ్యన తిక్క తిక్కగా ఉంటున్నాడు, అనుకున్నది చేసేస్తున్నాడు అని నోరు మూసుకుంది.

* * *

కాస్త టీవీ సౌండ్ పెట్టమని, సౌండ్ ఎక్కువైంది తగ్గించమని, నువ్వు కష్టపడి సంపాదించి నాకు ప్యాంట్, చొక్కా తీయించమని షూ కొనమని సతాయించడం మొదలు పెట్టాడు. దాంతో విషయం అర్థమైన కామేశ్వరి తన తప్పు తెలుసుకుంది.

తేజాని హాస్టల్లో చేర్పించారు. టీవీ చూడడం మానిన తేజా ఇప్పుడు బాగానే చదువుతున్నాడు. కుటుంబరావు ప్రవర్తనతో కామేశ్వరి మనసు మార్చుకుని చక్కగా ప్రవర్తిస్తోంది. కుటుంబరావుకి బి.పి లేని మేనేజర్ వచ్చాడు. తేజాకి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. కుటుంబరావు లుంగీ కట్టుకుంటున్నాడు. ముగ్గురూ కలిపి ఒకే సినిమాకి వెళ్తున్నారు.

